అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా

ఈ ఫొటో ఉన్న ఈమెది జవ్వాది వరలక్ష్మి. పోలాకి మండలం నర్సాపురం గ్రామం. శ్రీఆంజనేయ మహిళా సమైఖ్య సంఘం సభ్యురాలు. ఈమె ఆయిల్ అండ్ ఫ్లోర్ మిల్ నడువుకోవటానికి రుణం కావాలని దరఖాస్తు చేసుకున్నారు. అడిగిన వెంటనే వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బంది ఆమెకు చెందిన సంఘాన్ని కలిశారు. సంఘం సభ్యుల తీర్మానం మేరకు రూ.4.3లక్షలు రుణం మంజూరు చేశారు. మండల కేంద్రంలో మిల్ ఏర్పాటు చేసుకుని ఆమె ఉపాధి పొందుతున్నారు. చాలామంది వచ్చి వివరాలు అడిగుతున్నారని ఈమె ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఈ ఫొటో ఉన్న కొతిరాణి పోలమ్మది పోలాకి మండలం, చీడివలస. ఈమె విజయదుర్గ మహిళా సమైఖ్య సంఘం సభ్యురాలు. ఆటో కోసం రుణం కావాలని దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నతి స్కీమ్‌లో (పీఓపీ) రూ.3.4లక్షలు రుణం మంజూరైంది. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఈమెకు ఆటో అందజేశారు. ప్రస్తుతం ఈమె ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తోంది. రుణం మంజూరు చేయటంలో వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది సహకారం మరువలేదని ఆనందం వ్యక్తం చేస్తోంది.



- స్త్రీ నిధి, ఉన్నతితోపాటు మరెన్నో రుణాలు
- బ్యాంకుల్లో సైతం పెరిగిన పరపతి
- మహిళల పాలిట వరంగా మారిన వైఎస్సార్ క్రాంతిపథం



పోలాకి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత మహిళల అభ్యున్నతి దిశగా అడుగులు వేశారు. వైఎస్సార్ క్రాంతిపథం పేరుతో మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ.. వారికి వైఎస్సార్ ఆసరా పేరుతో గతంలో డిఫాల్టర్‌గా మారిన సంఘాల వడ్డీలను సైతం నాలుగు దఫాలుగా చెల్లించి అండగా నిలిచారు. జీరోవడ్డీ రుణాలతోపాటు అనేక రూపాల్లో విస్తృతమైన రుణాలు అందించి, వారి పరపతిని అమాంతం పెంచేలా చర్యలు తీసుకున్నారు. సీఎం జగన్‌కు అక్కచెల్లెమ్మలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

పోలాకి మండలంలో గత ప్రభుత్వంతో పోల్చితే నేడు మహిళా సంఘాలకు అందించిన రుణాలు అమాంతంగా పెరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. మండలంలో మొత్తం 1,728 మహిళా సంఘాలు ఉండగా.. అందులో 20,086 మంది సభ్యులు ఉన్నారు.

నాడు	
ఉన్నతి (ఎస్సీ, ఎస్టీ మహిళా రుణాలు)2018–19	రూ.4లక్షలు
స్త్రీనిధి ద్వారా అందించిన రుణాలు 2018–19	రూ.1.03కోట్లు
బ్యాంక్ లింకేజీలు 2018–19	రూ.20.26 కోట్లు
రికవరీ	65 శాతం
నేడు	
ఉన్నతి (ఎస్టీ,ఎస్సీ మహిళా రుణాలు)	2023–24 రూ.38 లక్షలు
స్త్రీనిధి ద్వారా అందించిన రుణాలు 2019–24	రూ.4.87 కోట్లు
బ్యాంక్ లింకేజీలు2023–24	రూ.49.67 కోట్లు
వి.ఆర్.ఎఫ్(మత్స్యకారుల రుణాలు)2019–24	రూ.15.9 లక్షలు
సీ.ఐ.ఎఫ్ (కమ్యూనిటీ రుణాలు)2019–24	రూ.89 లక్షలు
ఎం.కె.ఎస్.పి 2019–24	రూ.21.17లక్షలు
రికవరీ	రూ.98.6శాతం

అర్హత ఉంటే చాలు



మహిళా సంఘ సభ్యురాలు అయివుండి, అర్హత ఉంటే అప్పు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. గతంతో పోల్చితే మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత పెరిగింది. రుణాలు పొందటమే కాకుండా సమయానికి రికవరీ కూడా పద్ధతిగా జరుగుతోంది. జీరో వడ్డీ రుణాలు మండలంలోని అన్ని సంఘాలు వినియోగించుకున్నాయి. ఎస్టీ, ఎస్సీ మహిళలకు విస్తృతంగా రుణాలు మంజూరు చేశాం. – జి.రాజారావు, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతిపథం, పోలాకి మండలం

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మంగళశాసన పాశురం



మంగళశాసన పాసురం నిర్వహిస్తున్న భక్తులు

నరసన్నపేట: స్థానిక గీతా మందిరంలో ధనుర్మాసం సందర్భంగా మంగళవారం పెరుమాళ్లకు గరుడ వాహనంపై వేంచేశారు. రంగనాథ స్వరూపంగా రామచంద్రుల స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంగళశాసన పాశురం వినిపించారు. శ్రీకృష్ణ పరమాత్మను, యశోదానంద గోపికా బృందం , ఆండాళ్ల తల్లి బృందాలకు హారుతులిచ్చామని అర్చకులు సూరిబాబు తెలిపారు.

రహదారి పనుల పరిశీలన



రహదారిని పరిశీలిస్తున్న తమ్మినేని చిరంజీవినాగ్, నాయకులు

పొందూరు: నియోజకవర్గంలో ప్రతి పల్లెకు రహదారులు వేశామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ తెలిపారు. మండలంలోని కేశవదాసుపురంలో 1,400 మీటర్ల మేర వేస్తున్న రహదారిని మంగళవారం పరిశీలించారు. సీఎండీఎఫ్ నిధులు రూ.50 లక్షలతో రహదారిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ బాడాన వెంకటకృష్ణారావు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే ప్రజాపాలన

- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



సచివాలయం అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

నరసన్నపేట: సచివాలయాల ఏర్పాటుతో ప్రజలకు అన్ని సేవలు అందుబాటులోనికి వచ్చాయని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కంబకాయలో నూతనంగా నిర్మించిన సచివాలయ అదనపు భవనాన్ని మంగళవారం ప్రారంభిచారు. ప్రజలందరికీ స్వగ్రామంలోనే సేవలు అందుతున్నాయని వివరించారు. నియోజకవర్గంలోని 91 సచివాలయాల్లో అధిక చోట్ల నూతన భవనాలు నిర్మించినట్లు వివరించారు. సర్పంచ్ పాగోటి కుసుమకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొట్టేళ్లకు గిరాకీ



పొట్టేళ్లు కొనుగోలు చేస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలోని కొల్లివలస సంతలో పొట్టేళ్లకు గిరాకీ పెరిగింది. సంక్రాంతికి ముందు వచ్చే సంత (మంగళవారం) కావడంతో కొనుగోలుదారులు పోటీపడ్డారు. మేకలు, గొర్రెలు, కోళ్లు అధిక ధరలు పలికాయి. పండగకి సుదూర ప్రాంతాల నుంచి ఇప్పటికే బంధువులు రావడంతో పల్లెల్లో సందడి నెలకొంది.

వామనావతారంలో గోవిందుడు



ప్రత్యేక అంలకరణలో వెంకటేశ్వర స్వామి

సారవకోట: మండలంలోని చీడిపూడి కల్యాణ వెంకటేశ్వర ఆలయంలో స్వామి వారిని మంగళవారం వామన అవతారంలో అలంకరించారు. ఇక్కడ జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సహిత మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గడపగడపకూ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కంబకాయ సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు, మహిళల ఆర్థికాబివృద్ధికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారన్నారు. ఈ నాలుగేళ్ల 8 నెలల్లో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత కేవలం సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కాపు వీధిలో మురుగు కాలువ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, కంబకాయ సర్పంచ్ పాగోటి కుసుమకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు పాగోటి గౌతమి, పీఏసీఎస్ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, పార్టీ నాయకులు సురంగి నర్సింగరావు, పాగోటి ప్రభాకర్, పాగోటి కృష్ణ, తంగి అప్పారావు, వెలమల శ్రీనివాస్, అల్లు అప్పలనాయుడు, పాగోటి విష్ణువర్ధన్, ఎంపీడీఓ మధుసూదనరావు, వీఆర్వోలు రేవతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు కంబకాయలో

కంబకాయలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావులు తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం



భూముల రీసర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రంగయ్య

ఆమదాలవలస రూరల్: గ్రామాల్లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించడానికే రీసర్వే నిర్వహించడం జరుగుతుందని శ్రీకాకుళం ఆర్డీఓ సి.హెచ్. రంగయ్య అన్నారు. మండలంలోని తోగరాం గ్రామ రెవెన్యూలో జరుగుతున్న రీసర్వేను మంగళవారం పరిశీలించారు. మండలంలోని 18 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తిచేయడం జరిగిందని, 15 గ్రామాల్లో సర్వే జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రీసర్వే చేయడానికి ఒక రెవెన్యూ గ్రామంలో 120 రోజుల సమయం పడుతుందన్నారు. ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలు, జిరాయితీ భూములను సర్వే చేయడం జరుగుతుందన్నారు. రైతులు తమ ఆధారాలతో సర్వేకు సహకరించాలన్నారు. రీసర్వేలో తప్పులు సరిచేసుకోవాలన్నారు. ఇసుకలపేట గ్రామం వద్ద నాగావళి నదిపై జరుగుతున్న బలసలరేవు బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా బీటీ రోడ్డు వేసేందుకు అవసరమైన భూములను గుర్తించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ గణపతిరావు, మండల సర్వేయర్ గోవిందరావు, వీఆర్వో రాంబాయి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా స్థిరపడాలి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మహిళలు ఆర్థికంగా స్థిరపడాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక బాలాజీనగర్–2లో ఉన్న కేఆర్‌పీ ఎడ్యుకేషన్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు స్వయం సాధికారిత లక్ష్యంగా పనిచేయాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా 150 మంది మహిళలకు ఉచితంగా టైలరింగ్, అంబ్రాయిడింగ్, అల్లికల్లో శిక్షణ ఇవ్వడం హర్షణీయమన్నారు. కేఆర్‌పీ ఎడ్యుకేషన్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి రూ.లక్ష విరాళం ప్రకటించారు. మరిన్ని సేవా ప్రాజెక్టులు చేపట్టాలన్నారు. ఈ సంర్భంగా సంస్థ సెక్రటరీ కె.రమణ, సంస్థ డైరెక్టర్ రూపావతి, ఎంపీపీ దొర సావిత్రమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.ప్రదీప్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎం.తాతయ్య, సంస్థ సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

ప్రజల మదిలో చెరగని ముద్ర



పాతపట్నం: మండల కేంద్రంలోని ఆస్పత్రి కూడలిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. పాదయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా... పాతపట్నం, ఎల్.ఎన్.పేట, హిరమండలం, కొత్తూరు, మెళియాపుట్టి మండలాల్లో విజయోత్సవ కార్యక్రమాలను ఎమ్మెల్యే రెడ్డి శాంతి నిర్వహించారు. కేక్‌లు కట్ చేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో తెలుసుకున్న సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్, నాయకులు



హిరమండలం: వైఎస్సార్ జంక్షన్ వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



కొత్తూరు: మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



మెళియాపుట్టి: ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, నాయకులు

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



పింఛన్ అందజేస్తున్న గ్రామ వలంటీర్ జగదీష్

సరుబుజ్జిలి: మూలసవలాపురం గ్రామానికి చెందిన గొల్లపల్లి కృష్ణ గుండె సంబంధిత వ్యాధితో విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈయనకు సంబంధించిన డప్పుకళాకారుల పింఛన్‌ను గ్రామ వలంటీర్ గొల్లపల్లి జగదీష్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి అందజేశారు.

200 కిలో మీటర్లు ప్రయాణించి..



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మౌనిక

కొత్తూరు: మండలంలోని ఆర్‌కేపురం గ్రామానికి చెందిన వృద్ధుడు పతివాడ సంజీవరావు విశాఖపట్నంలోని కుమార్తె ఇంటి వద్ద ఉంటూ కేజీహెచ్‌లో వైద్యం పొందుతున్నారు. గ్రామ వలంటీర్ లిమ్మాడ మౌనిక 200 కిలో మీటర్ల దూరం మంగళవారం ప్రయాణించి వృద్ధాప్య పింఛన్ అందజేశారు.

విద్యుత్ సమస్యలు పరిష్కారం

పాతపట్నం: స్థానిక సబ్ డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక మంగళవారం నిర్వహిచారు. వేదిక చైర్మన్ బి.సత్యనారాయణ (విశ్రాంత జిల్లా న్యాయమూర్తి) పలు విద్యుత్ సమస్యలను పరిష్కరించారు. అనంతరం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు విద్యుత్ ఆదాపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. టెక్కలి ఈఈ జి.శంకరరావు, డీఈఈ ప్రసాదరావు, వి.జనార్దనరావు, ఆర్.సురేంద్రకుమార్, ఏఈ రమేష్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

ప్రజలందరికీ ఆరోగ్య సేవలు అందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పలు సచివాలయాల పరిధిలో మంగళవారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. వైద్య సేవలు అందించి, మందులు అందజేశారు. వైద్యాధికారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆమదాలవలస రూరల్: బెలమాంలో చిన్నారికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



సారవకోట: అవలింగిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సారవకోట పీహెచ్‌సీ వైద్యురాలు సౌమ్య



నరసన్నపేట: కామేశ్వరిపేటలో మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఆరంగి మురళి

సంక్షిప్తంగా

పింఛన్ల పంపిణీ



పురుషోత్తం నగర్, రాజీవ్‌నగర్ కాలనీ వాసులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శంకర్

నరసన్నపేట: మండలంలోని పింఛన్ల పంపిణీ పండగ వాతావరణంలో మంగళవారం నిర్వహించారు. 10,750 పింఛన్‌దారులకు రూ.మూడు వేల చొప్పున పింఛన్ మొత్తాన్ని గ్రామ వలంటీర్లు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు అందించారు. కొత్తగా మంజూరైన 119 పింఛన్లనూ పంపిణీ చేపట్టారు. నరసన్నపేట పంచాయతీ పరిధిలో 2,919 పింఛన్లు అందజేశారు. సర్పంచ్ బూరల్లి శంకర్, ఎంపీటీసీలు డేవిడ్, వైశ్వరాజు కేశవరాజు, వార్డు సభ్యులు ఆర్.శ్రీధర్, పి.కృష్ణప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.సాయి ప్రసాద్, ముద్దాడ అప్పలనాయుడు అందించారు.

విధుల్లో చేరుతున్న అంగన్‌వాడీలు

నరసన్నపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకుంటున్నాయని, కార్యకర్తలు, ఆయాలు ముందుకు వస్తున్నారని పీఓ నాగమణి మంగళవారం తెలిపారు. కేంద్రాలు తెరుస్తామని 49 మంది రాతపూర్వకంగా తెలియజేశారని, వీరిలో పలువురు కేంద్రాలు తెరిచారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సమ్మె చేస్తున్న మిగిలిన వారికి నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. పోస్టు ద్వారా కొందరికి, స్వయంగా మరి కొందరికి నోటీసులు ఇస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఆదేశాలను దృష్టిలో పెట్టుకొని కార్యకర్తలు, ఆయాలు కేంద్రాలను తెరవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు మండల సమావేశం

జలుమూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దామోదరరావు మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. అధికారులు పూర్తిసమాచారంతో హాజరుకావాలన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు పెంచాలి

కొత్తూరు: గిరిజన గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాల్లో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు మరింత పెంచాలని వైద్య సిబ్బందికి ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి ఆదేశించారు. మండలంలోని ఇరపాడు గూడలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని పీఓ పరిశీలించారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ వ్యాధి ఉన్నవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించాలన్నారు. మెట్టూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మస్టర్ల దిద్దుబాటుపై ఆగ్రహం



ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

పోలాకి: మండలంలోని ఉపాధి హామీ పథకం వేతనదారుల మస్టర్లలో దిద్దుబాట్లుపై ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలాకి మండల పరిషత్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీల మండల స్థాయి ప్రజావేదికకు పీడీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతి పంచాయతీలోనూ మస్టర్ల దిద్దుబాట్లును సోషల్ ఆడిట్ టీమ్ గుర్తించిందన్నారు. 2022–23 సంవత్సరానికి సంబంధించి రూ.16.5 కోట్లు నిధుల ఖర్చుకు సంబంధించి ఆడిట్ జరిగిందన్నారు. ఫైనాన్సియల్ డీవియేషన్స్ ఎక్కడా లేకపోయినప్పటికీ క్వాలిటీ ఆఫ్ వర్క్ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, ఎస్ఆర్పీ వెంకటరమణ, ఎంపీడీఓ ఉషశ్రీ, ఏపీఓ రమణ, ఇన్‌చార్జ్ ఈసీ రామకృష్ణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.